# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 22 పేజీలు: 4 వెల: రూ.4/- మంగళవారం 22 సెప్టెంబర్ 2026 ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## 22ఎ భూముల్లో...
# మానవహక్కుల సంఘం జోక్యం

### స్వతంత్ర విచారణ చేపట్టాలని సీఎస్‌కు ఆదేశం

### భూముల అంశంలో జాతీయ మానవ హక్కుల సంఘం స్వతంత్ర విచారణ చేపట్టాలని సీఎస్‌కు ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర



విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. తమ ఆదేశాల విషయంలో తీసుకున్న చర్యలపై 4 వారాల్లో రిపోర్టు ఇవ్వాలని స్పష్టం




చేసింది. 22ఏ అంశంపై హైదరాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఈమేరకు చర్యలు తీసుకుంది.

22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియామకం చేసింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

**న్యాయపరమైన వివాదాలు, కంప్యూటరైజేషన్ సమస్యలు**

నిషేధిత భూముల జాబితాలో ఇళ్లు, అపార్ట్‌మెంట్లను చేర్చడం హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదానికి దారితీసింది. ఈ ఆందోళనకు ప్రధాన కారణాలుగా న్యాయపరమైన వివాదాలు, కంప్యూటరైజేషన్ ప్రక్రియలో జరిగిన లోపాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై సుమారు చాలా మేరకు దరఖాస్తులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి.

**కంప్యూటరైజేషన్ ప్రక్రియలో పొరపాటు**

ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లకు సమీపంలో ఉన్న భూములకు బైనంబర్లు ఉన్నాయని అధికారులు చెబుతుండగా, ఆ ఆస్తులు ప్రైవేట్ అని పేర్కొంటూ యజమానులు పెద్ద ఎత్తున కోర్టులను ఆశ్రయించారు. గత డిసెంబర్‌లో జిల్లా కలెక్టర్లు నిషేధిత భూముల జాబితాను ప్రభుత్వానికి సమర్పించినప్పుడు, ఆస్తులను ఞా, దీ, జ, ఐ , జు అనే వర్గాలుగా విభజించారు. అయితే కంప్యూటరైజేషన్ ప్రక్రియలో సంబంధిత సర్వే నంబర్ల ప్రస్తుత స్థితిని పర్యవేక్షించకుండా, సరిచూసుకోకుండానే రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ నుంచి వివరాలను నేరుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతో అవి నిషేధిత జాబితాలోకి చేరాయి. వాటిని విక్రయించి రిజిస్ట్రేషన్ చేయాలనే దగ్గర 22ఏ సమస్య బయటపడింది. దీంతో చాలా మంది అయోమయంలో పడ్డారు. ఈ సమస్యపై స్పందించిన ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తామని వెల్లడిస్తూ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.



## నిధులు ఇస్తున్నా...
# పనుల్లో జాప్యం

### వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపై రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. పనులు వేగంగా ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. నిధులు ఇస్తున్నా, పనుల్లో జాప్యం చోటుచేసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "వచ్చే 30 రోజుల్లో 24 గంటలపాటు పనులు జరగాలి. వర్క్ షెడ్యూల్ తయారు చేసుకుని ముందుకెళ్లాలి. సీఎంవో అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో సమీక్ష చేయాలి. ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షించాలి. ఇక నుంచి కలెక్టర్ ప్రతిరోజు ఆసుపత్రి పనుల పురోగతిపై దృష్టి సారించాలి. త్వరలో ఓపీ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అలాగే సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్‌ను ఏర్పాటు చేయాలని, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. సనత్‌నగర్ టిమ్స్ నిర్వహణను ఏజెన్సీకి అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# దానం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీమ్



### అసెంబ్లీ స్పీకర్ ఆదేశాలను పక్కన పెట్టిన హైకోర్టు

### హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం న్యాయవాదుల వాదనలు

### నేడు విచారణకు వచ్చే అవకాశం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు.గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ

..మిగతా 2లో



## రామ మందిరంలో
# భారీ కుంభకోణం

### 105 సార్లు విరాళాల చోరీ

### సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం

### ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్ట్

### సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు

### ట్రస్టు ఉన్నత పదవుల నుంచి చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తొలగింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఞదీ×) లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

# రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్

## శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

### రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

### ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి

### గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ

### ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

### నెల రోజుల్లో అన్నిచోట్లా పనులు మొదలని ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు

..మిగతా 2లో





## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు
# హైకోర్టు నోటీసులు

### నాంపల్లి కోర్టు తీర్పును సవాల్ చేసిన టిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు


**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణా త్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది.విచారణ సంద ర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు.

## ఎస్ఐఆర్-2026పై రానున్న 30 నుంచి

# 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి




### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి**

**అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ...ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, వీటి పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడుపరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25 తేదీలోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు.ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని, బీఎల్ఏలను నోటీసుల పంపిణీ ప్రక్రియలో పాల్గొననివ్వకూడదని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లనుగుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను, నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంగేజ్‌మెంట్ వేడుకల్లో పాల్గొన్న జర్నలిస్టులు



**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(నమస్తే ఉదయం)**

కర్ణాటక రాష్ట్రం రాయచూర్ పట్టణంలోని శ్రీరాఘవేంద్ర మఠం ఫంక్షన్ హాల్ లో సోమవారం కేటిదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామం మాజీ సర్పంచ్ మాధవి కులకర్ణి కుమార్తె గాయిత్రికులకర్ణి ఎంగేజ్‌మెంట్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గద్వాల జిల్లా జర్నలిస్టులు చుక్క సుదర్శన్, రవిబాబు, జ్యోతి రవి, ఉప సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మండల నాయకులు వెంకటపురం గోపి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన జంటకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఆత్మీయులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుకు యువకుడు మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(నమస్తే ఉదయం)**

పిడుగుపాటుకు యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం కేటిదొడ్డి మండలం యర్సన్ దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వలక్ష్మీ ఎంకప్ప దంపతుల ఏకైక కుమారుడు మల్లేష్ (17) వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో గ్రామ సమీపంలో ఉన్న ఆలయం వద్ద గల చెట్టు కింద నిలబడాడు. ఈ క్రమంలో చెట్టు మీద పిడుగుపడటంతో మల్లేష్ సంఘటన స్థలంలో మృతి చెందాడు. లక్ష్మీ ఎంకప్ప దంపతుల ఒకగానొక్క కుమారుడు మృతి చెందడంతో వారి రోధనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



## గోనుపాడు గ్రామంలో ఘనంగా ‘స్వచ్ఛతా హి సేవా’ కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(నమస్తే ఉదయం)**

గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో ‘స్వచ్ఛతా హి సేవా’ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జి. రాములమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడమే ధ్యేయంగా గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామ పెద్దలు ఒకే వేదికపైకి వచ్చి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జి. రాములమ్మ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛతను దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని కోరారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా పంచాయతీ కేటాయించిన నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులందరి సహకారంతో గోనుపాడు గ్రామాన్ని పరిశుభ్రమైన, ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచేందుకు పంచాయతీ తరఫున అన్ని తగిన చర్యలు వేగవంతంగా తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యమ్మ రాముడు, పంచాయతీ కార్యదర్శి షాలేహా, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## దానం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీమ్

**మొదటి పేజీ తరువాయి...**

తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్ ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.





## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్

**మొదటి పేజీ తరువాయి...**

కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## బ్లూ బాయ్స్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక పూజలు.. అన్నదాన కార్యక్రమం



### ముఖ్య అతిథి... దారం సతీష్ గుప్తా

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బాలానగర్‌లోని రాజు కాలనీ రోడ్డులో బ్లూ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక పూజా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి వాణిజ్య విభాగం అధ్యక్షులు దారం సతీష్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దారం సతీష్ గుప్తా మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో బ్లూ బాయ్స్ సభ్యులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో రాజు కాలనీ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఘనంగా వినాయక నవ రాత్రులు


బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ వినాయక మండపం వద్ద మహిళా భక్తులు


కాటేదాన్ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ టి ప్రేమదాస్ గౌడ్ లు


రాజేంద్రనగర్ నవ జ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో వినాయకుని మండపం వద్ద నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి


ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ లో ప్రతిష్టించిన గణనాథుని దర్శించుకున్న ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్, న్యాయవాది ఇట్యాల వెంకటేష్


గణనాథుని సన్నిధి లో పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య తదితరులు

**బుద్వేల్, సెప్టెంబరు 21 ( నమస్తే ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం వినాయక మండపాల వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. బుద్వేల్ లో బీ ఆర్ ఎస్ నాయకులు పోరెడ్డి ధర్మా రెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య లు గణనాథుని దర్శించుకుని పూజలు చేశారు. నవ జ్యోతి యూత్ క్లబ్ వినాయక మండపం వద్ద నృత్య ప్రదర్శన లు నిర్వహించారు. పాల్గొన్న వారికి కాంగ్రెస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి బహుమతులు అందచేశారు. కాటేదాన్ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద జరిగిన అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ టి ప్రేమదాస్ గౌడ్ లు పాల్గొన్నారు. బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో వినాయక మండపం వద్ద మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వినాయక లడ్డు ను వేలం పాట లో తీసుకున్న పీర్ల గూడెం వెంకట స్వామి, కుటుంబ సభ్యులు

## రాజేంద్రనగర్ శ్రీ పోచమ్మ కాలనీ యూత్ అసోసియేషన్ వినాయక లడ్డును రూ 21,500లకు వేలం పాటలో తీసుకున్న పీర్ల గూడెం వెంకట స్వామి

**బుద్వేల్, సెప్టెంబరు 21 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ శ్రీ పోచమ్మ కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని చేతిలోని లడ్డును స్థానిక భక్తుడు పీర్లగూడెం వెంకటస్వామి రూ .21, 500 కు వేలం పాటలో తీసుకున్నారు. ఆదివారం రాత్రి వేలం పాట జరిగింది. వేలం పాట లో పీర్లగూడెం వెంకట స్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## వినాయక నవరాత్రి సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమములో పాల్గొన్న: జనసేన నాయకులు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్‌లో జనసేన నాయకుడు బోగాది వెంకటేశ్వర్ రావు ఆహ్వానం మేరకు వినాయక నవరాత్రుల వేడుకల సందర్భంగా నిర్వహించిన, ప్రత్యేక పూజలకు, అన్నసమారాధన కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర జనసేన ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొని భక్తులతో కలిసి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, భరత్ గౌడ్, స్వాతి గౌడ్, బస్తీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.



## చైతన్య విల్లాస్ గణేష్ లడ్డు 10500

### వేలంలో లడ్డు కైవసం చేసుకున్న రవీందర్ తివారి

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ డివిజన్ లో గల చైతన్య విల్లాస్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీ విఘ్నేశ్వరుడి పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలంపాట లో కాలనీవాసులు రవీందర్ తివారీ 10500 రూపాయలకు కైవసం చేసుకున్నాడు. పాడినారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నర్సింహం, రామ కృష్ణా రెడ్డి, గోపి, రమణా చారి, అనీష్, దీపక్, గోకుల్ పాల్గొన్నారు.




రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను కలిసిన నందిగామ నరసింహ, తదితరులు

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిశీలకులుగా నందిగామ నర్సింహ్మా, కేసారం క్రిష్ణలు

**బుద్వేల్, సెప్టెంబరు 21 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ పరిశీలకులుగా నందిగామ నర్సింహ్మా, కేసారం క్రిష్ణ లు నియమితులైనారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్, మానకొండూరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నందిగామ నర్సింహ్మా, కేసారం క్రిష్ణ లు మైలార్దేవుపల్లి లోని ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ నివాసంలో సోమవారం ఆయనను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అండదండలతో కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ ను బలోపేతం చేసి త్వరలోనే అన్ని మండలాలు, డివిజన్లలో కమిటీ లు వేయడం జరుగుతుందన్నారు.



గగన్ పహాడ్ లో గణనాథులను దర్శించుకున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బీ ఆర్ ఎస్ ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి

## గణేష్ మండపాలను సందర్శించిన పట్లోళ్ల కార్తిక్ రెడ్డి

**బుద్వేల్ , సెప్టెంబరు 21 (నమస్తే ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి సోమవారం గగన్ పహాడ్ లోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గగన్‌పహాడ్‌లోని శ్రీ శివ గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని కార్తిక్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం తిరుపతిరెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి, శీలం తిరుపతిరెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య, గుమ్మడి కుమార్, నోముల రాము యాదవ్, పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి, వల్లూరి నాగేష్,సూరెడ్డి సాయికృష్ణారెడ్డి, సంతోష్ రెడ్డితో పాటు భక్తులు మరి గ్రామ పెద్దలు, వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



## నేడు మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21(నమస్తే ఉదయం)**

మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్ లో నిర్మాణ విభాగం ద్వారా కొత్త ఫీడర్ల ఏర్పాటు కారణంగా మంగళవారం సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. మైలార్ దేవుపల్లి, రీగల్ గార్డెన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సుభాన్ కాలనీ, వినాయక్ నగర్, అయేషా కాలనీ, హషమాబాద్, దస్తగిరి నగర్, టవర్ గల్లీ, తమిళ బస్తీ, మిలన్ కాలనీ, అలీ నగర్, అహ్మద్ నగర్, ప్యాలెస్ వ్యూ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ మాజీ అధ్యక్షుడు పంబాల జనార్ధన్ మృతి

**బుద్వేల్, సెప్టెంబరు 21 (నమస్తే ఉదయం) :**




రాజేంద్రనగర్ సర్కిల్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ మాజీ అధ్యక్షుడు, దళిత నాయకుడు, బుద్వేల్ కు చెందిన పంబాల జనార్దన్ (56) సోమవారం రాత్రి తుది శ్వాస విడిచారు. మూడు రోజులుగా అనారోగ్యం తో బాధపడుతున్న ఆయనను చికిత్స నిమిత్తం అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ లో చేర్పించారు. చికిత్స పొందుతున్న జనార్దన్ ఆసుపత్రి లో మరణించారు. ఆయనకు భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం బుద్వేల్ లో అంత్య క్రియలు జరిగే అవకాశం ఉంది. పంబాల జనార్దన్ మరణ వార్త గురించి తెలుసుకున్న పలువురు దళిత నాయకులు, వివిధ పార్టీల నాయకులు, స్నేహితులు సంతాపం తెలియచేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి

### పత్రికల్లో ప్రచురితమయ్యే సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, ప్రజావాణి ద్వారా అందే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తుల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టాలని అన్నారు.అదేవిధంగా జిల్లాలోని సమస్యలకు సంబంధించి వార్తాపత్రికలు, ఇతర మాధ్యమాల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. పత్రికల్లో ప్రచురితమైన సమస్యలను కేవలం వార్తలుగా కాకుండా ప్రజల సమస్యలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలుగా పరిగణించి, వాటి వాస్తవ పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని



సూచించారు.

**విద్య, వైద్యం, గృహ నిర్మాణ శాఖలపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో విద్య, వైద్య, గృహ నిర్మాణ తదితర శాఖలకు సంబంధించిన పలు సమస్యలు ప్రజల దృష్టికి వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు కారణాలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని, మందులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు.గృహ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, గృహ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సమస్యల పరిష్కారానికి వ్యవస్థీకృత కార్యాచరణ**

ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి పరిశీలించి, దాని పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని, బాధ్యతను నిర్ణయించుకుని, నిర్ణీత గడువులో పరిష్కరించే విధంగా వ్యవస్థీకృతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఒకే సమస్య పదేపదే ప్రజావాణిలో రావడం లేదా పత్రికల్లో ప్రతికూల వార్తగా ప్రచురితం కావడం జరగకుండా అధికారులు ముందస్తుగా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# ధర్నాలతో దద్దరిలిన గద్వాల



రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు



రోడ్డుపై బైఠాయించి నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులు



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

### వరి పంట రక్షణకై జమ్మిచెడు దగ్గర గద్వాల - కర్నూలు రహదారి దిగ్బంధం

### జూరాల నీటి విడుదలకు డిమాండ్ చేస్తూ బిజెపి, బిఆర్ఎస్ నాయకులు, రైతుల ధర్నా

### రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా అని మండిపాటు

### 24 గంటల్లో నీటిని విడుదల చేస్తామని అధికారుల హామీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(నమస్తే ఉదయం)**

సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో నీరు అందక ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్ నుండి జమ్మిచెడు వరకు ర్యాలీగా వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిలదీశారు. జమ్మిచేడు జమ్ములమ్మ ఆలయం రోడ్డు,జమ్మిచెడులో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి కర్నూల్ రోడ్డుపై బైఠాయించారు.గద్వాల - కర్నూలు ప్రధాన రహదారిపై బైఠాయించడంతో సుమారు అయిదు గంటలపాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. జూరాల డ్యామ్ నుంచి తక్షణమే కుడి కాలువలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమాలలో బిజెపి జిల్లా యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మరియు బిఆర్ఎస్ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు, నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి పాల్గొని మద్దతు తెలిపారు. బిజెపి నాయకురాలు డి.కె. స్నిగ్ధరెడ్డి మాట్లాడుతూ ..."గతంలో మహబూబ్ నగర్ ఎంపీ డి.కె. అరుణ నడిగడ్డలో రిజర్వాయర్లు ఏర్పాటు చేయించి నీటిని వదిలేందుకు అన్ని ఏర్పాట్లు చేసినా, నేడు రిజర్వాయర్లలో నీరు లేని పరిస్థితి దాపురించింది అని విమర్శించారు. రైతులు నీటి కోసం ఎదురుచూస్తుంటే అధికారులు కాలువలకు చుక్కనీరు వదలడం లేదని మండిపడారు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పందించకపోగా వరి పంట ఎందుకు వేశారని ప్రశ్నించడం విచారకరం అని ఆవేధన వ్యక్తం చేశారు వారంలో కనీసం 3 రోజులు నీరు వదిలి పంటలను కాపాడాలని అధికారులను కోరారు. బిఆర్ఎస్ నాయకురాలు బాసు శ్యామల హనుమంతు నాయుడు మాట్లాడుతూ "తెలంగాణ రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి జూరాల నీటిని ఆంధ్రా ప్రాంతాలకు ఎలా తరలిస్తారు? జూరాల కుడి కాలువల గేట్లను ఎందుకు మూసివేశారో ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ నుండి జమ్మిచెడు వరకు ర్యాలీగా వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిలదీశాం. తక్షణమే జూరాల గేట్లు ఎత్తి చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వాలి అని వారు వారి డిమాండ్ చేశారు.

**24 గంటల హామీతో విరమణ**

సుమారు 5 గంటల పాటు కొనసాగిన ఈ ధర్నా వల్ల గద్వాల - కర్నూలు రహదారిపై తీవ్ర ట్రాఫిక్ స్తంభించిపోయింది. ధర్నా స్థలానికి చేరుకున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నాయకులు మరియు రైతులతో చర్చలు జరిపారు. 24 గంటల వ్యవధిలో కాలువలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. 24 గంటల్లో నీళ్లు ఇవ్వని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు.



## నిమజ్జనాన్ని నీటిని విడుదల చేయడి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 21 (నమస్తే ఉదయం)**

కరీంనగర్లో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించడానికి ఎస్సారెస్పీ కాల్వకు నీటి విడుదల చేయాలని బిజెపి ఆధ్వర్యంలో చలో చింతకుంట కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఆధ్వర్యంలో చేపట్టారు చింతకుంట కాలువపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు హిందువుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూపిస్తుందని సునీల్ రావు ఆరోపించారు చింతకుంట బుజ్జిపై రాస్తారోకో చేయడంతో వాహనాలు ఎక్కడెక్కడ నడిచిపోయాయి గణేష్ నిమజ్జనానికి కేవలం రెండు రోజులే సమయం ఉండగా ఇంతవరకు నీటిని విడుదల చేయకపోవడం తో నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు బిజెపి నాయకుడు తెలిపారు వెంటనే ఎస్సారెస్పీ ద్వారా చింతకుంట కాల్వకి నీటి విడుదల చేయాలని డిమాండ్ చేశారు గణేష్ నిమజ్జనానికి నీటిని విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




## నమ్మించి మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 21 (నమస్తే ఉదయం)**

కొనుగోలు చేసే ప్రతి వస్తువులు ఇలా తరుగుదల ఉంటుంది వ్యాపారులు విక్రయించే వస్తువులు తూకం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నష్టపోతున్నారు. తనిఖీ చేసే సమయంలోనే వ్యాపారులు తమ త్రాసులను, ఎలక్ట్రిక్ తూకం యంత్రాలను సరి చేసుకుంటున్నారు. అధికారులు అటు కదలగానే మళ్లీ యధావిధిగా మోసాలకు పాల్పడుతు న్నారు. ఈ మోసం వల్ల ప్రతి కిలోకు వినియోధానికి ఎంతో కొంత వ్యత్యాసం వస్తుంది. కిలో వస్తు కొనుగోలు చేస్తే కనీసం 100 గ్రాముల వరకు నష్టపోతున్న సందర్భాలు ఉన్నాయి.

**లక్షల రూపాయలు జేబుల్లోకి...**

ప్రస్తుతం మార్కెట్లో కొన్ని రకాల బియ్యం 26 కిలోలుగా బస్తాలు ముద్రిస్తున్నారు. కానీ అందులో 25 కిలోల బియ్యం ఉంటున్నాయి. అంటే ఒక బస్తాకు కిలో బియ్యం చొప్పున నష్టపోతున్నారు. కానీ వ్యాపారులు 26 కిలోలు బియ్యానికి డబ్బు లెక్క కడుతున్నారు. దీంతో ఒక బస్తాలో కిలో బియ్యం అంటే కనీసం 150 రూపాయలు నష్టపోవాల్సి వస్తుంది. నెలకు కనీసం 50,000 మంది కొనుగోలు చేస్తారు అంటే 75 లక్షల రూపాయలు వ్యాపార జేబుల్లోకి చేరుతున్నాయి జిల్లాలో 7.5 లక్షల జనాభా ఉంది.

**నిర్వహణలో నిర్లక్ష్యం**

సాధారణంగా ఎలక్ట్రిక్ తూకం యంత్రాలను సున్నితంగా వినియోగించాలి లేదంటే అందులో ఉండే సెన్సార్ దెబ్బతింటాయి ఫలితంగా వస్తువు తూకం వేసే సమయంలో వ్యత్యాసం వచ్చే అవకాశం ఉంది దీన్ని వ్యాపారులు దుకాణాల నిర్వాహకులు గుర్తించడం లేదు ఎలక్ట్రిక్ టుకు యంత్రాలు సంవత్సరానికి ఒకసారి త్రాసు బాట్లతో తూకం వేసే యంత్రాలను రెండేళ్లకు ఒకసారి పరీక్ష చేయించాలి. దీంతో తూనికలు కొలతల శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనబడు తుందన్న ఆరోపణలు ఉన్నాయి.

## వార్డు సభ్యుల ఫోరం కరీంనగర్ జిల్లా కో ఇంచార్జీగా ఆసిఫ్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 21 (నమస్తే ఉదయం)**



కరీంనగర్ జిల్లా వార్డు మెంబర్ల ఫోరం జిల్లా కో ఇంచార్జీగా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన వార్డు మెంబర్ ఆసిఫ్ హబీబ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్బీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా బొజ్జ గణపయ్య లడ్డూ వేలంపాట

### రూ.1,60,000 వేలకు దక్కించుకున్న దండ రామకృష్ణారెడ్డి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం)**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుచిత్ర పరిధిలోగల ఎన్సీఎల్ గోదావరి ఎల్బీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నవరాత్రుల సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులకు దర్శనమిచ్చిన గణనాథుడి లడ్డూను నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో రూ.1,60,000 వేలకు దండ రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ లడ్డూ వేలం పాట ఉత్సాహభరితంగా సాగింది. దండ రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు లడ్డూను దక్కించుకోవడంతో నిర్వాహకులు, స్థానిక భక్తులు వారికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.వవ కార్యక్రమంలో డి ఆర్ కె రెడ్డి,ఎం రాజు,మహేష్,ఓంనాథ్ రెడ్డి,సతీష్ పెట్ల ,బి సతీష్ ప్రవీణ్ కుమార్ ,అంజి రెడ్డి,దీక్షిత్ రెడ్డి,నగేష్ కుమార్ ,సిద్దేశ్వర్ ,సదానంద్ లు పాల్గొన్నారు.




## బ్రెయిన్ ట్యూమర్ బాధితుడికి రూ.10 వేల సాయం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 21( నమస్తే ఉదయం)**

బొల్లారం డివిజన్‌లో నివాసముంటున్న ఒడిశాకు చెందిన గోవింద్ చంద్రక్కర్ బ్రెయిన్ ట్యూమర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. నాలుగు నెలలుగా చికిత్స చేయించడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. పరిస్థితి విషమించడంతో వైద్యులు స్వగ్రామానికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ పట్టణాధ్యక్షుడు కే.జె.ఆర్. ఆనంద్ కృష్ణ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంబులెన్స్‌లో స్వగ్రామానికి బయలుదేరుతున్న సమయంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన ఆనంద్ కృష్ణ రెడ్డిని స్థానికులు అభినందించారు.

## బొల్లారంలో 10 ఏళ్ల బాలుడు అదృశ్యం

**పటాన్ చెరు,సెప్టెంబర్ 21 (నమస్తే ఉదయం) :**



సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జీఎంఆర్ కాలనీ (ఖాజీపల్లి) కి చెందిన అన్మోల్ (10) అనే బాలుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఎంఆర్ కాలనీలో నివసించే రింకు దేవి రోజువారీ పనులకు వెళ్లే సమయంలో ఆమె కుమారుడు అన్మోల్ ఇంట్లోనే ఒంటరిగా ఉండేవాడు. మానసిక స్థితి సరిగ్గా లేని ఈ బాలుడు గత ఎనిమిది రోజుల క్రితం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో రెండుసార్లు ఇలాగే వెళ్లి మళ్లీ ఇంటికి చేరుకోవడంతో, ఈసారి కూడా వస్తాడని కుటుంబసభ్యులు భావించారు. అయితే రోజులు గడుస్తున్నా బాలుడు రాకపోవడం, బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి రింకు దేవి పోలీసులను ఆశ్రయించారు.బాలుడి ఆనవాళ్లు: పేరు: అన్మోల్ వయస్సు: 10 సంవత్సరాలు మానసిక స్థితి: మానసికంగా స్థిరత్వం లేని వాడు దుస్తులు: తెల్లటి చొక్కా, షార్ట్ ధరించి ఉన్నాడు. ఈ బాలుడి జాడ తెలిసిన వారు వెంటనే ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బొల్లారంలో 12 ఏళ్ల బాలుడు అదృశ్యం

### ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి

**పటాన్ చెరు,సెప్టెంబర్ 21(నమస్తే ఉదయం)**



స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు సందీప్ కుమార్ అదృశ్యమైనట్లు ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బాలాజీ నగర్ నివాసి జితేంద్ర కుమార్ బర్మా కుమారుడు సందీప్ కుమార్ స్థానిక బొల్లారం పబ్లిక్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో బాలుడు ఇంట్లోనే ఉన్నాడు. విధులకు వెళ్లిన తండ్రి సాయంత్రం 5:00 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి సందీప్ కనిపించలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.బాలుడి ఆనవాళ్లు: పేరు: సందీప్ కుమార్,వయస్సు: 12 సంవత్సరాలు,మాట్లాడే భాష: హిందీ,ధరించిన దుస్తులు: గులాబీ రంగు చొక్కా, జీన్స్ ప్యాంటుపై వివరాలు, ఆనవాళ్లు కలిగిన బాలుడి ఆచూకీ తెలిసినవారు వెంటనే ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌లో లేదా సమీపంలోని పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి.. మేయర్ శ్రీనివాస్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 21 (నమస్తే ఉదయం)**

ప్రత్యేక తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని, పదవుల కంటే ప్రజల ఆకాంక్షలకే ప్రాధాన్యం ఇచ్చిన గొప్ప పోరాటయోధుడని కరీంనగర్ మేయర్ శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ లోని బైపాస్ లోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కాగా ఈ కార్యక్రమానికి మేయర్ శ్రీనివాస్ హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కార్పొరేటర్ వాసాల రమేష్ జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, కార్పొరేటర్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ తొలి దశ నుంచి మలిదశ ఉద్యమం వరకు ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను సజీవంగా ఉంచేందుకు బాపూజీ కృషి చేశారని, 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడిన సమయంలో తన జలదృశ్యం నివాసాన్ని ఉద్యమ కార్యకలాపాలకు ఉపయోగించుకునేలా అందించడం ద్వారా మలిదశ ఉద్యమానికి కూడా తన వంతు సహకారం అందించారని అన్నారుతెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన బాపూజీ 2012లో శాశ్వతంగా మన నుండి వెళ్లిపోయాడని అన్నారు. ఆయన సేవలను గుర్తించి ప్రతి ఏటా జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఆయన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించడమే ఆయనకు నిజమైన నివాళి అని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, తెల్ల లక్ష్మీ రమేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, వేముల కవిత చంద్రశేఖర్, పడిశెట్టి లక్ష్మీ భూమయ్య, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం, కోశాధికారి అలసభద్రయ్య, పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, పోపా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వోడ్నాల రవీందర్, ప్రచార కార్యదర్శి మార్త ప్రకాష్, పట్టణ కార్యదర్శి వంగర ఆంజనేయులు, జిల్లా నాయకులు స్వర్గం నర్సయ్య, ఎలిగేటి శ్రీనివాస్, జక్కని ప్రభాకర్, దేవసాని పాపయ్య, గడ్డం వెంకటేశం, మెతుకు కృష్ణ చైతన్య, దీకొండ లక్ష్మీనారాయణ, కలర్ సత్తన్న, అలసత్యం, చిలుక నర్సప్ప, గజవెల్లి కనకయ్య, మెతుకు వంశీకృష్ణ, అరుకాల నాగేందర్, వంగ నాగరాజు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(నమస్తే ఉదయం)**



గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి పరుశు రాముని దేవాలయంలో, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి , వారి తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు.ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ జమ్ములమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులతో గద్వాల నియోజకవర్గంలోని ప్రజలు, రైతాంగం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733